
సాక్షి జగిత్యాల

సోమవారం । 16 । అక్టోబర్ । 2023

సూర్యప్రభ వాహనంపై అమ్మవారు

కోరుట్ల: దసరా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా పట్టణంలోని అష్టలక్ష్మీ, శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయాల్లో అమ్మవారు మొదటి రోజు సూర్యప్రభ వాహనంపై ఊరేగారు. భక్తులు మంగళహారతులతో అమ్మవారికి స్వాగతం పలికారు.





న్యూస్‌రీల్

వృద్ధులు, దివ్యాంగులు ఇంటి నుంచే ఓటేసే అవకాశం

- కలెక్టర్ యాస్మిన్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్

జగిత్యాలరూరల్: వృద్ధులు, దివ్యాంగులు ఇంటినుంచే ఓటేసే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ అనుమతించిందని జిల్లా కలెక్టర్ యాస్మిన్ బాషా తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ జిల్లాలో 6,87,952 మంది ఓటర్లు ఉన్నారని, వీరిలో 12,077 మంది వృద్ధులు, 32,342 మంది దివ్యాంగులు ఉన్నారని తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటు హక్కు ఇంటి నుంచి వినియోగించుకోవడానికి 80 ఏళ్ల పైబడిన వారు, 40శాతం మించి ఉన్న దివ్యాంగులకు ఓటరుగా నమోదైన వారు ఫారం-12 డి లో తమ పూర్తి వివరాలను నవంబర్ 7లోపు బూత్‌స్థాయి అధికారులకు అందించాలని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన ఎమ్మెల్యేలు



కవితతో ఎమ్మెల్యేలు

రాయికల్: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఆదివారం హైదరాబాద్‌లో జగిత్యాల, కోరుట్ల ఎమ్మెల్యేలు సంజయ్‌కుమార్, విద్యాసాగర్ రావుతోపాటు కోరుట్ల బీఆర్ఎస్ అభ్యర్థి సంజయ్ కలిశారు. అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించినట్లు సమాచారం.

17న జగిత్యాలకు ఎమ్మెల్సీ కవిత రాక



ఎమ్మెల్సీ కవిత

రాయికల్: తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఈనెల 17న జగిత్యాల జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లాకేంద్రంలో అదేరోజు నిర్వహించనున్న బతుకమ్మ సంబరాల్లో పాల్గొంటారు. అలాగే ఈనెల 21న కోరుట్లలో నిర్వహించే బతుకమ్మ వేడుల్లో పాల్గొంటారు. మహిళలు పెద్ద ఎత్తున హాజరు కావాలని జాగృతి నాయకులు కోరారు.

ఆర్టీసీ గ్రాండ్ ఫెస్టివల్ జెండా ఆవిష్కరణ



జెండా ఆవిష్కరిస్తున్న డీఎం విజయ మాధురి

కోరుట్ల: ఆర్టీసీ కోరుట్ల డిపోలో ఆర్టీసీ 100 రోజుల గ్రాండ్ ఫెస్టివల్ చాలెంజ్ జెండాను డిపో మేనేజర్ విజయమాధురి ఆదివారం ఆవిష్కరించారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాలతో రాబోయే 100 రోజుల్లో శబరిమల యాత్ర, శుభ ముహూర్తాల సందర్భంగా ఆర్టీసీకి అత్యధిక ఆదాయం సమకూర్చుకునేందుకు ఉద్యోగులు చర్యలు చేపట్టాలన్నారు. ఆర్టీసీ ప్రవేశపెట్టిన ప్రయాణ పథకాలను ప్రయాణికులకు వివరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ జీపీ.సింగ్, గంగారాం, ఐఆర్‌కే.రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మేనిఫెస్టో చారిత్రకం

- జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత



తహసీల్ చౌరస్తాలో బీఆర్ఎస్ సంబరాలు

జగిత్యాలటౌన్:బీఆర్ఎస్ మేనిఫెస్టో చారిత్రకమని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. పార్టీ అధినేత ప్రకటించిన మేనిఫెస్టోపై ఆదివారం స్థానిక తహసీల్ చౌరస్తాలో బాణాసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. అన్నివర్గాల ప్రజలకు లబ్ధి చేకూర్చేలా మేనిఫెస్టో రూపొందించారని, బడుగు, బలహీనవర్గాలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గోళి శ్రీనివాస్, రూరల్ ఎంపీపీ పాలెపు రాజేంద్రప్రసాద్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏడుగురితో హస్తం తొలి జాబితా

- పెద్దపల్లిలోని మూడు నియోజకవర్గాలకూ అభ్యర్థుల వెల్లడి
- ఉమ్మడి జిల్లాలో మరో ఆరు స్థానాలకు త్వరలో ప్రకటన
- ఆరు పథకాలే ఆయుధాలంటున్న కాంగ్రెస్ నేతలు
- 19న పెద్దపల్లి, కరీంనగర్‌లో రాహుల్ పర్యటన
- ఎన్టీపీసీ, సింగరేణి కార్మికులు, ఆర్‌ఎఫ్‌సీఎల్ బాధితులతో సమావేశం
- రాహుల్ యాత్రతో కొత్త జోష్ వస్తుందంటున్న నేతలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రానున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ తొలిజాబితా విడుదలైంది. ఏడుగురు అభ్యర్థులతో తొలి జాబితా ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ.. మిగిలిన ఆరుస్థానాలకు త్వరలోనే రెండోజాబితాలో అభ్యర్థులను ప్రకటించనుంది. వాస్తవానికి 'కారు' పార్టీతో పోల్చితే 'హస్తం' పార్టీ అభ్యర్థుల ఎంపికలో జాప్యం చేసింది. ఇవేమీ ఎన్నికలపై ప్రభావం చూపబోవని, ఆలస్యంగా వచ్చినా సరే తాము ప్రచార కదనరంగంలో కొదమసింహాల్లా దూకుతామని కాంగ్రెస్ అభ్యర్థులు ధీమాగా ఉన్నారు. తొలిజాబితా అనుకూల పవనాలు ఉన్నచోట అధికార బీఆర్ఎస్‌ను దీటుగా ఎదుర్కొగలిగిన అభ్యర్థులు ఉన్న స్థానాలు కావడం గమనార్హం.

ఈ స్థానాలకు అభ్యర్థులు..

ఉమ్మడి జిల్లాలోని పెద్దపల్లి జిల్లాపైనే కాంగ్రెస్ పార్టీ బాగా ఆశలు పెట్టుకుంది. ఉమ్మడి జిల్లాలోని 13 అసెంబ్లీ స్థానాల్లో మంథనిలో ఒకేచోట తమ ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తుండటం.. ఇక్కడే పార్టీకి పట్టు ఉండటంతో ముందుగా ఆ జిల్లాలోని మూడుస్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఆ తరువాత జగిత్యాల జిల్లాలోని ధర్మపురి, జగిత్యాలకు అభ్యర్థులను ప్రకటించిన హస్తం పార్టీ.. కోరుట్లను తరువాత జాబితాకు మార్చింది. రాజన్నసిరిసిల్లజిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో వేములవాడకు అభ్యర్థిని ప్రకటించి.. సిరిసిల్లకు ఆపింది. కీలకమైన కరీంనగర్‌లో ఒక్క మానకొండూరుకు అభ్యర్థిని ప్రకటించి.. మిగిలిన చొప్పదండి, హుజూరాబాద్, హుస్నాబాద్, కరీంనగర్ స్థానాల ప్రకటన వాయిదా వేసింది. ప్రస్తుత జాబితాలోని అభ్యర్థుల్లో ముగ్గురు ఓసీ (వెలమ, బ్రాహ్మణ, రెడ్డి) సామాజికవర్గాలకు చెందిన వారు కాగా.. ఇద్దరు బీసీ (బుందెల, మున్నూరు కాపు), మరో ఇద్దరు ఎస్సీ (మాదిగ) సామాజికవర్గాలకు చెందిన వారు.

కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలు

- మహాలక్ష్మీ పథకంలో భాగంగా ప్రతి మహిళకూ నెలకు రూ.2,500 ఆర్థిక సాయం.
- రూ.500కే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం.
- రైతు భరోసా కింద ఏటా రైతులు, కౌలు రైతులకు ఎకరాకు రూ.15వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12వేల ఆర్థిక సాయం.
- వరి పంటకు అదనంగా రూ.500 బోనస్.
- గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు కరెంట్ ఉచితం.
- ఇళ్లు లేని పేదలకు ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల సాయం.
- విద్యా భరోసా కార్డు ద్వారా విద్యార్థులకు రూ.5 లక్షల పరిమితితో వడ్డీరహిత ఆర్థిక సాయం, ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూళ్ల ఏర్పాటు.
- చేయూత కింద పింఛనుదారులకు నెలకు రూ.4,000 పింఛను, ఆరోగ్య శ్రీ కింద రూ.10 లక్షల బీమా.

అభ్యర్థి పేరు: తాటిపర్తి జీవన్ రెడ్డి



పుట్టినతేదీ: 05-01-1951
విద్యార్హతలు: బీఏ. ఎల్ఎల్‌బీ (ఉస్మానియా)
సామాజిక వర్గం: రెడ్డి
స్వగ్రామం: బతికెపెల్లి, పెగడపల్లి మండలం, జగిత్యాల
అనుభవం: ఆరుసార్లు ఎమ్మెల్యే, రెండుసార్లు మంత్రి, ప్రస్తుతం ఎమ్మెల్సీ

అభ్యర్థి పేరు: దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



పుట్టినతేదీ: 30 మే 1969
విద్యార్హతలు : ఎంఏ, ఎల్ఎల్‌బీ
సామాజిక వర్గం: బ్రాహ్మణ
స్వగ్రామం : ధన్వాడ, కాటారం మండలం
అనుభవం : మంత్రి, నాలుగు సార్లు ఎమ్మెల్యే

అభ్యర్థి పేరు: ఆది శ్రీనివాస్



పుట్టినతేదీ: 15-09-1966
విద్యార్హతలు: ఐటీఐ
సామాజికవర్గం: బీసీ, మున్నూరు కాపు
స్వగ్రామం : రుద్రంగి
అనుభవం: 2009, 2010, 2014, 2018 ఎన్నికల్లో పోటీ, ప్రస్తుతం తెలంగాణ పీసీసీ కార్యదర్శి, వేములవాడ ఇన్‌ఛార్జి

అభ్యర్థి పేరు: కవ్వంపల్లి సత్యనారాయణ



పుట్టినతేదీ: 10-06-1967
విద్యార్హతలు: ఎంబీబీఎస్ జనరల్ సర్జన్
సామాజికవర్గం: ఎస్సీ (మాదిగ)
స్వగ్రామం : కరీంనగర్
అనుభవం: 2009లో, 2014లో ఎమ్మెల్యేగా పోటీ

అభ్యర్థి పేరు: చింతకుంట విజయరమణారావు



పుట్టినతేదీ: 08-11-1966
విద్యార్హతలు: ఇంటర్
సామాజిక వర్గం: వెలమ
స్వగ్రామం : శివపల్లి, ఎలిగేడు
అనుభవం: 2001లో జెడ్పీటీసీ, 2009లో ఎమ్మెల్యే

అభ్యర్థి పేరు: రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్



పుట్టినతేదీ: 15-08-1972
విద్యార్హతలు: బీఏ
సామాజిక వర్గం: బీసీ, బుందేలా
స్వగ్రామం : రామగుండం, గోదావరిఖని
అనుభవం: శాప్ చైర్మన్, 2014, 2108లో రామగుండం నుంచి ఎమ్మెల్యేగా పోటీ.

అభ్యర్థి పేరు: అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



పుట్టినతేదీ: 01-04-1968
విద్యార్హతలు: ఇంటర్, ఐటీఐ (పెద్దపల్లి)
సామాజిక వర్గం: ఎస్సీ (మాదిగ)
స్వగ్రామం : గోదావరిఖని
అనుభవం: జెడ్పీ చైర్మన్, ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, 2014, 2018లో ధర్మపురి నుంచి ఎమ్మెల్యేగా పోటీ..

అభ్యర్థులు వీరే..

రామగుండం: ఠాకూర్ మక్కాన్‌సింగ్
పెద్దపల్లి : చింతకుంట విజయరమణారావు
మంథని : దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
ధర్మపురి : అడ్లూరి లక్ష్మణ్
జగిత్యాల : తాటిపర్తి జీవన్‌రెడ్డి
వేములవాడ : ఆది శ్రీనివాస్
మానకొండూరు: కవ్వంపల్లి సత్యనారాయణ

19న రాహుల్ పర్యటన

ఈనెల 19న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల్లో పర్యటించనున్నారు. 18న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సింగరేణి, ఎన్టీపీసీ ఉద్యోగులు, యూనియన్ లీడర్లు, ఆర్ఎఫ్‌సీఎల్ కార్మికులు, కాంట్రాక్ట్ ఉద్యోగాల బాధితులతో సమావేశమవుతారు. సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు పెద్దపల్లిలో బహిరంగసభలో మాట్లాడతారు. రైస్‌మిల్లర్ల అసోసియేషన్, రైతులతో సమావేశమవుతారు. రాత్రి 7 నుంచి 8 గంటల వరకు పెద్దపల్లి నుంచి కరీంనగర్ వరకు పాదయాత్ర ద్వారా చేరుకుంటారు.

కలిసికట్టుగా ముందుకు..

జగిత్యాల: వచ్చే ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలతో కలిసికట్టుగా పనిచేసి విజయం సాధిస్తామని కాంగ్రెస్ జగిత్యాల అభ్యర్థి జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ టికెట్ ప్రకటించిన సందర్భంగా ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. టీఆర్ఎస్ పార్టీ ఉద్యమపంథా వీడి.. ప్రజలకు దూరమైందని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసం కోల్పోయిన పార్టీ మనుగడ ఉండదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క హామీని కూడా అమలుచేయలేదన్నారు. ఈ క్రమంలో ఆ పార్టీ ఓట్లు అడిగే నైతిక హక్కు కోల్పోయిందన్నారు.

గెలిచి తీరుతా..

గొల్లపల్లి: ఇప్పటికే పలుమార్లు ఓడిపోయాయనని, అయినా పార్టీ కార్యకర్తలు, ప్రజలకు అందుబాటులో ఉంటూ వచ్చానని అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. పార్టీ టికెట్ ఇచ్చిన సందర్భంగా 'సాక్షి'తో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ బడుగు బలహీనవర్గాల పార్టీ అని నాకు టికెట్ ఇవ్వడం ద్వారా నిరూపితమైందని, ఈ సారి ఎలాగైనా గెలిచి పార్టీకి బహుమతిగా ఇస్తానని వెల్లడించారు.

నియోజకవర్గానికో మహిళా పోలింగ్ కేంద్రం



- కేంద్రాల ఏర్పాటుపై అధికారుల దృష్టి
- మొదటిసారిగా ఏర్పాటు

జగిత్యాల:ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఈ సారి అత్యధికంగా పోలింగ్ శాతం పెంచడంపై ఎన్నికల సంఘం దృష్టి సారించింది. ఇప్పటికే జిల్లాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించడంతో పాటు, ఓటు ప్రాముఖ్యత, ఓటు విలువ తెలిపేందుకు ప్రజల్లో మొదటిసారి అవగాహన కల్పించింది. ఈ సదస్సులతోపాటు, ప్రత్యేక పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటోంది. ఇందులోభాగంగా నియోజకవర్గానికో యూత్ పోలింగ్ కేంద్రం, దివ్యాంగులు, మహిళా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.

ప్రత్యేక ఏర్పాట్లపై అధికారుల దృష్టి

గత ఎన్నికల్లో తక్కువ పోలింగ్ నమోదైన గ్రామాలను గుర్తించి అక్కడ పోలింగ్ శాతం పెరిగేలా చర్యలు తీసుకోవడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదర్శ కేంద్రాలతో పాటు, ప్రత్యేకంగా మహిళలు, మహిళ కేంద్రం, యూత్ కేంద్రం, దివ్యాంగుల కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు.

యువ ఓటర్ల కోసమే

ఎన్నికల కమిషన్ నియోజకవర్గాకో యూత్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. దీంతో యువ ఓటర్ల శాతం పెరగనుంది. ఈ పోలింగ్ కేంద్రంలో మొత్తం యూత్ సిబ్బంది, యువతే ఉంటారు. ఆయా కేంద్రాల్లో ఓటు హక్కు వినియోగానికి సంబంధించిన మహనీయుల సూక్తులు అక్కడ ప్రదర్శించనున్నారు. చూస్తేనే అందంగా కన్పించేలా యూత్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారు. జిల్లాలో మూడు నియోజకవర్గాలు ఉండగా.. మూడు చోట్ల ఏర్పాటు చేయనున్నారు.

మహిళలకు, దివ్యాంగులకూ...

నియోజకవర్గానికో మహిళ, దివ్యాంగ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ముఖ్యంగా మహిళా కేంద్రాల్లో మహిళా అధికారులు, మహిళా పోలీసులు, మహిళా సెక్యూరిటీతోపాటు, అందులో ఉండేవారంతా మహిళలే ఉండనున్నారు. వీరికి ప్రత్యేక వసతులు కల్పించనున్నారు. ఇవి కూడా నియోజకవర్గాకొకటి చొప్పున ఏర్పాటు చేయనున్నారు.

దివ్యాంగులకు ప్రత్యేకం...

దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా నియోజకవర్గానికో బూత్‌ను ఏర్పాటు చేయనున్నారు. దివ్యాంగ అధికారులు, సిబ్బంది అందరూ వారే ఉండనున్నారు. ఇప్పటికే దివ్యాంగుల కోసం ఇంటి నుంచి వేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు

ప్రతి నియోజకవర్గానికో యూత్, మహిళ, దివ్యాంగ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. అందులో యూత్ బూత్‌లో యూత్ సిబ్బంది, మహిళా బూత్‌లో మహిళా సిబ్బంది, దివ్యాంగుల బూత్‌లో దివ్యాంగులే ఉంటారు. ఇది ఒక ప్రత్యేకంగా ఉంటుంది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చర్యలు చేపట్టాం.

– యాస్మిన్ బాషా, జిల్లా కలెక్టర్

తక్కువగా నమోదైన బూత్‌లు

నియోజకవర్గం	బూత్‌నంబర్	కేంద్రం	ఓటర్లు	ఓటేసింది	శాతం
జగిత్యాల	181	జగిత్యాల	517	316	61.12
కోరుట్ల	199	మెట్‌పల్లి	1014	581	57.30
ధర్మపురి	135	ధర్మారం	568	339	59.68

పత్తి కొనుగోళ్లకు రంగం సిద్ధం

- జిల్లాలో దసరా తర్వాత సీసీఐ ద్వారా కొనుగోళ్లు

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో పత్తి కొనుగోళ్లకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. కాటన్ కార్పొరేషన్ ఇండియా ద్వారా వెల్గటూర్ మండలంలోని జిన్నింగ్ మిల్లు పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన కేంద్రంలో పత్తిని మద్దతు ధర (పింజ పొడువును బట్టి రూ.7020, రూ.6,620) చొప్పున కొనుగోలు చేయనున్నారు. ఈ ఏడాది పత్తి రైతు నిర్ధాణకు సీసీఐ కొన్ని నిబంధనలు విధించింది.

జిల్లాలో 1.47లక్షల క్వింటాళ్ల దిగుబడి

జిల్లాలో పత్తిని 18,487 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. ఎక్కువగా ధర్మపురి మండలంలో 5,920 ఎకరాలు, వెల్గటూర్‌లో 4,800, మల్యాలలో 3,120, గొల్లపల్లిలో 3000, రాయికల్‌లో 1,050, పెగడపల్లిలో 180, మేడిపల్లిలో 172, కథలాపూర్‌లో 138, జగిత్యాల అర్బన్‌లో 107 ఎకరాల చొప్పున సాగు చేశారు. ఈసారి పత్తి విత్తనాలు వేసినప్పటి నుంచి చేతికొచ్చే వరకు వర్షాలు కురవడంతో కలుపు తీయలేకపోయారు. ఎరువులు వేయలేకపోయారు. భూమి తేమగా ఉండటంతో పురుగులు, తెగుళ్లు విజృంభించాయి. పత్తి దిగుబడి గణనీయంగా పడిపోయింది. వాస్తవంగా ఎకరాకు 10నుంచి 12 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని రైతులు సంబరపడ్డారు. అయితే వాతావరణ పరిస్థితులతో అది 8క్వింటాళ్లకు తగ్గింది. జిల్లాలో 1.84 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని భావించినా అధికారుల అంచనా ప్రకారం 1.47 లక్షల క్వింటాళ్లకు పడిపోతుందని చెబుతున్నారు. కొద్ది విస్తీర్ణంలో సాగు చేసిన పత్తి రైతులు గ్రామాల్లోనే దళారులకు విక్రయించే పరిస్థితిలో ఉన్నారు. రవాణా ఖర్చులు, సీసీఐ లేనిపోని నిబంధనలతో వేగలేక, ఎంతో కొంతధరకు గ్రామాల్లోనే విక్రయించే ఏర్పాట్లు చేసుకుంటున్నారు.



జిల్లాలో పత్తిని తీస్తున్న మహిళా రైతులు

దసరా తర్వాత పత్తి కొనుగోళ్లు

విజయదశమి తర్వాత పత్తి కొనుగోళ్లు చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం ప్రయత్నాలు మొదలుపెట్టింది. సీసీఐ పలు కొత్త నిబంధనలను తెరమీదకు తీసుకొచ్చింది. రైతులకు ఆధార్ తప్పనిసరి చేసింది. ఆధార్ బయోమెట్రిక్ నిర్ధారణ అయిన తర్వాత మాత్రమే రైతుల నుంచి పత్తి కొనుగోలు చేయనుంది. బయోమెట్రిక్ ప్రక్రియలో భాగంగా తొలుత రైతు వేలిముద్రలను నిర్ధారణ చేస్తారు. ఒక వేళ వేలిముద్రల ద్వారా నిర్ధారణ కాకుంటే ఐరిష్ స్కానింగ్ చేయాలని సీసీఐ నిర్ణయించింది. వేలిముద్రలు, ఐరిష్ స్కాన్ విధానం ద్వారా కూడా ఆధార్ ధృవీకరణ కాకపోతే, ఓటీపీ, క్యూఆర్‌కోడ్ స్కాన్ ప్రక్రియను చేపడుతారు. ఇలా ఆధార్ కార్డు బయోమెట్రిక్ ప్రాసెస్ పూర్తయితేనే రైతుల నుంచి మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేస్తారు. కార్డు లేనివారు ఆధార్ నమోదు గుర్తింపుపత్రంతోపాటు పాన్ కార్డు, ఓటర్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంకు పాస్‌బుక్ వంటి గుర్తింపు పత్రాలు ఇవ్వాలి. దీనికి తోడు, పత్తి అమ్మిన తర్వాత వచ్చే డబ్బులను ఆధార్‌తో అనుసంధానం చేసిన బ్యాంకు ఖాతాలో మాత్రమే జమ చేస్తారని అధికారులు ప్రచారం చేస్తున్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు



పత్తి నాణ్యతగా ఉన్నప్పటికీ తేమగా ఉందని, నాణ్యత లేదని ఇబ్బంది పెడుతుంటారు. పత్తిలో అక్కడక్కడా ఎండిపోయిన ఆకులు కనబడినా తిరస్కరిస్తారు. గతంలో జరిగిన పొరబాట్లు జరుగకుండా పత్తిని కొనుగోలు చేయాలి.

– సోమ తిరుపతి, లక్ష్మీపూర్, గొల్లపల్లి

ఆధార్ నిర్ధారణ అయితేనే..



ఈ ఏడాది పత్తి కొనుగోళ్లలో సీసీఐ కఠిన నియమాలు తీసుకొచ్చింది. ఆధార్ బయోమెట్రిక్ పూర్తి అయితేనే కొనుగోళ్లు చేపట్టనున్నారు. రైతులు సీసీఐ నిబంధన మేరకు తీసుకురావాలి. తక్కువ ధరకు దళారులకు విక్రయించొద్దు.

– ప్రకాష్, మార్కెటింగ్ జిల్లా అధికారి

తొలిరోజు ఐదుగురికి బీ-ఫామ్స్

- సీఎం చేతులమీదుగా తీసుకున్న బీఆర్ఎస్ అభ్యర్థులు
- హైదరాబాద్‌లో అందుకున్న మంత్రి కేటీఆర్
- హుస్నాబాద్ బహిరంగ సభలోనే సతీష్‌బాబుకు..
- మానకొండూర్ ఎమ్మెల్యే రసమయికి, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరికి బీ-ఫామ్

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి జిల్లా పరిధిలోని 13 అసెంబ్లీ నియోజకవర్గాలకుగాను తొలిరోజు (ఆదివారం) నలుగురు అభ్యర్థులకు పార్టీ బీ-ఫామ్‌లను సీఎం కేసీఆర్ హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో అందించారు. హైదరాబాద్‌లో అందుకున్నవారిలో రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్, మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి ఉన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో జరిగిన ప్రజాఆశీర్వాద సభకు హాజరైన సీఎం కేసీఆర్.. ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌బాబుకు సభావేదికపైనే బీ-ఫామ్ అందించారు. దీంతో బీ-ఫామ్ అందుకున్నవారి సంఖ్య ఐదుకు చేరింది. ఉమ్మడి జిల్లా పరిధిలోని మిగితా అభ్యర్థులకు సోమవారం తెలంగాణభవన్‌లో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా బీ-ఫామ్స్ అందించనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించారు.

క్లుప్తంగా

యువతకు సన్మానం



సన్మానిస్తున్న గ్రామస్తులు

పెగడపల్లి: ఇటీవల వెలువడిన పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో ఉద్యోగం సాధించిన మండలంలోని నామాపూర్‌కు చెందిన ఇద్దరిని సర్పంచ్ ఇనుగండ్ల కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆదివారం సన్మానించారు. గ్రామానికి చెందిన దండవేని శిరీష, నునుగొప్పుల మనోజ్ పోలీస్ ఉద్యోగాలకు ఎంపికకాగా.. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద సత్కరించారు. ఎంపీటీసీ చిర్ర రజిత, ఉప సర్పంచ్ పెద్ది సంతోష్, నాయకులు సంది మల్లారెడ్డి, చిర్ర రమణాకర్, సత్యనారాయణరెడ్డి, దేవ య్య,వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందిస్తున్న కృష్ణ చిన్ననాటి మిత్రులు

బుగ్గారం(ధర్మపురి): ధర్మపురికి చెందిన మహంకాళి కృష్ణ ఇల్లు, దుకాణం అగ్నిప్రమాదంలో కాలిపోయి రూ.4.50లక్షల నష్టం వాటిల్లింది. బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు పట్టణప్రజలు, కృష్ణ చిన్ననాటి మిత్రులు ముందుకొచ్చారు. ఆయన మిత్రబృందం కలిసి రూ.1,13,000లు అందించారు. వర్తకసంఘం సభ్యులు రూ.55వేలు, వాసవీమాత కిట్టి గ్రూప్ రూ.20వేలు బాధిత కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల సభ్యులు, చిన్ననాటి మిత్రులు పాల్గొన్నారు.

దుర్గమ్మకుంటలో మొసలి



దుర్గమ్మకుంటలో మొసలి

మల్లాపూర్:మండలకేంద్రంలోని దుర్గమ్మకుంట చెరువులో ఆదివారం మొసలి కనిపించింది. స్థానికుల కథనం ప్రకారం.. దుర్గా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గమ్మకుంటకు ఆనుకుని కనకదుర్గాదేవి ఆలయంలో వేడుకలు నిర్వహించేందుకు వెళ్లిన భక్తులకు చెరువులో మొసలి కనిపించింది. విషయాన్ని వారు గ్రామస్తులకు తెలిపారు. దీంతో వారు తండోపతండాలకు వచ్చి చూశారు. గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు.

గ్రామాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు



దూలూర్ శివారులో తనిఖీ అధికారులు

కథలాపూర్:మండలంలోని బొమ్మెన, కలిగోట, దూలూర్ శివారులో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారుల బృందాలు ఆదివారం తనిఖీలు చేపట్టాయి. వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి అనుమానాస్పద వ్యక్తుల గురించి వివరాలు సేకరించారు. ఎన్నికల వేళ అక్రమంగా డబ్బులు, మద్యం తరలించకుండా తనిఖీలు చేస్తున్నట్లు అధికారులు గంగాధర్, చంద్రశేఖర్, హరీశ్‌చారి తెలిపారు.

ఆధారాలుంటే డబ్బు వాపస్

- ఎన్నికలతో సంబంధం లేకుంటే సరి
- పోలీసులు పట్టుకున్నా కోర్టుకు వెళ్లాల్సిన పని లేదు
- సమస్య పరిష్కారానికి త్రిసభ్య కమిటీ

‘కథలాపూర్ మండలంలోని ఇప్పపల్లి చెక్‌పోస్ట్ వద్ద బుధవారం సాయంత్రం ఓ వ్యక్తి వద్ద రూ.5 లక్షలు దొరకడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎన్నికల నగదు గ్రీవెన్స్ సెల్‌కు అప్పగించారు. ఆ డబ్బులకు ఎన్నికలకు సంబంధం లేదని బాధితుడు తగిన ఆధారాలతో గ్రీవెన్స్ సెల్ త్రిసభ్య కమిటీని కలవడంతో పరిశీలించి, శుక్రవారం డబ్బులు తిరిగి ఇచ్చేశారు.’



ఇటీవల ఇప్పపల్లి చెక్‌పోస్టు వద్ద నగదు పట్టుకున్న కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్

కోరుట్ల: గత ఎన్నికల సమయంలో ఎవరి వద్దనైనా రూ.50 వేలకు మించి దొరికితే చాలు.. పోలీసులు సెక్షన్ 102 సీఆర్‌పీసీ కింద కేసు నమోదు చేసి, ఆ డబ్బులను కోర్టులో డిపాజిట్ చేసేవారు. తర్వాత వాటిని విడిపించుకోవడానికి బాధితులు సరైన సాక్ష్యాలు చూపి, కోర్టు నుంచి రిలీజ్ ఆర్డర్ తెచ్చుకునేవారు. ఈ ప్రక్రియ ముగియడానికి మూడు నుంచి ఆరు నెలల సమయం పట్టేది.

ఇప్పుడు రెండు రోజుల్లో..

గతంలో డబ్బులు తీసుకెళ్తూ పోలీసులకు పట్టుబడిన సమయంలో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకున్న ఎన్నికల సంఘం ఈసారి కొత్త నిర్ణయం తీసుకుంది. డబ్బులు తీసుకెళ్తూ పట్టుబడిన ప్రతీ ఒక్కరిపై కేసు నమోదు చేసి, కోర్టుకు పంపకుండా జిల్లా కేంద్రంలోని గ్రీవెన్స్ సెల్‌కు డబ్బులు అప్పగించాలని సూచించింది. ఈ మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు లేదా పోలీసులు చెక్‌పోస్టుల వద్ద డబ్బులు పట్టుకుంటే వాటికి సంబంధించి పంచనామా నిర్వహించి, సంబంధిత వ్యక్తికి రశీదు ఇస్తారు. అనంతరం ఆ నగదును గ్రీవెన్స్ సెల్‌లో ఉండే త్రిసభ్య కమిటీ (డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారి, ఎన్నికల వ్యయ పరిశీలన పర్యవేక్షణ అధికారి, జిల్లా ట్రెజరీ అధికారి)కి అప్పగిస్తారు. ఈ కమిటీ ప్రతినిధులు ఆ నగదుకు ఎన్నికలతో ఎలాంటి సంబంధం లేదన్న ఆధారాలను పరిశీలించి, వెంటనే రిలీజ్ చేస్తారు. రూ.10 లక్షలకు మించి పట్టుబడితే మాత్రం ఐటీ శాఖ నుంచి క్లియరెన్స్ పొందాల్సి ఉంటుంది.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

- మీరు తీసుకెళ్తున్న డబ్బులు వ్యాపార లావాదేవీల కోసం అయితే వాటికి సంబంధించిన నగదు డ్రా చేసిన అకౌంట్ రశీదు, ఏటీఎం వివరాలు ఉండాలి.
- భూ క్రయవిక్రయాలతో సమకూరిన డబ్బులకు సంబంధిత డాక్యుమెంట్లు వెంట ఉంచుకోవాలి.
- పెళ్లి పనులు, బంగారం, ఇతరత్రా అవసరాల కోసం నగదు తీసుకెళ్తుంటే సంబంధిత పత్రాలు, పెళ్లి కార్డులు ఇతర ఆధారాలు ఉండాలి.
- అప్పు తీసుకున్నవారు లేదా అప్పు చెల్లించడం కోసం నగదు వెంట తీసుకెళ్లినట్లయితే ప్రామిసరీ నోట్లు, స్టాంప్ పేపర్లు వెంట ఉంచుకోవాలి.
- ఆరోగ్య అవసరాల కోసం డబ్బులు తీసుకెళ్తున్నట్లయితే పేషెంట్ చికిత్స తీసుకుంటున్న ఆస్పత్రి నుంచి వైద్యం అందిస్తున్న పత్రాలతోపాటు ఆస్పత్రి నిర్వాకుల ధ్రువీకరణ అవసరం ఉంటుంది.

ఎన్నికలతో లింకు ఉండొద్దు



ఎన్నికల సమయంలో పట్టుబడిన డబ్బులకు ఎన్నికలతో లింకు ఉండొద్దు. అలా అని ఆధారాలు చూపితే తిరిగి పొందడం సులువే. జిల్లా కేంద్రంలో ఉండే త్రిసభ్య కమిటీ పూర్తి స్థాయి ఆధారాలు పరిశీలించి, నిర్ధారించుకున్న తర్వాత 2, 3 రోజుల్లో డబ్బులు తిరిగి ఇస్తుంది.

– రవీందర్‌రెడ్డి, డీఎస్పీ, మెట్‌పల్లి

మొక్కజొన్నలు దళారుల పాలు

- ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు
- తెగనమ్ముకుంటున్న రైతులు
- క్వింటాల్‌కు రూ.290 వరకు నష్టపోతున్న వైనం



ఇబ్రహీంపట్నంలో రైతుల మక్కలను తూకం వేస్తున్న దళారులు

ఇబ్రహీంపట్నం: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకుందామంటే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో గిట్టుబాటు ధర లభించడం లేదని రైతులు వాపోతున్నారు. దీంతో దళారులకు అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొందంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏటా మార్క్‌ఫెడ్ ద్వారా రైతులకు గిట్టుబాటు ధర చెల్లించి మొక్కజొన్నలు కొనుగోలు చేసేది. ఈ ఏడాది ఇప్పటివరకు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు దళారులకు విక్రయిస్తున్నారు. ఇదే అదనుగా భావిస్తున్న దళారులు తక్కువ రేటు చెల్లిస్తూ అన్నదాతలను మోసం చేస్తున్నారు.

క్వింటాల్‌కు రూ. 290 నష్టం..

మండలంలో సుమారు 8,450 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. భారీ వర్షాల కారణంగా పంట దెబ్బతిని అంతంత మాత్రంగానే దిగుబడి వచ్చింది. వచ్చిన పంటనైనా అమ్ముకుందామంటే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదు. మార్క్‌ఫెడ్‌కు విక్రయిస్తే రైతులకు రూ.2,090 క్వింటాల్‌కు లభిస్తుంది. దళారులు మాత్రం రూ.1800 నుంచి రూ.1850కి క్వింటాల్ చొప్పున చెల్లిస్తున్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా కొనాలని రైతులు ఈనెల 10న ఇబ్రహీంపట్నం మార్కెట్ యార్డ్ వద్ద, మెట్‌పల్లి ఆర్డీవో కార్యాలయం వద్ద రాస్తారోకోలు కూడా చేశారు. తహసీల్దార్, ఆర్డీవోలకు వినతిపత్రాలు అందించారు. ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

రైతులను ఆదుకోవాలి



మొక్కజొన్నలకు మద్దతు ధర లభించాలంటే మార్క్‌ఫెడ్ కేంద్రాలు ప్రారంభించాలి. అధికారులకు వినతిపత్రాలు అందించినా స్పందించడం లేదు. దళారులు సిండికేట్ అయి తక్కువ ధరకు కొంటున్నారు. నష్టపోవాల్సి వస్తోంది.

– నల్లరమేశ్‌రెడ్డి, రైతు ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు

దళారులు దోచుకుంటున్నారు



కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో దళారులకు అమ్ముకోవాల్సి వస్తోంది. మొక్కజొన్నలకు మొదటగా క్వింటాల్‌కు రూ. 2200 ఉండగా ఇప్పుడు క్వింటాల్‌కు రూ.1850కే కొంటున్నారు.

– అబ్బుటి రాజరెడ్డి, రైతు, ఇబ్రహీంపట్నం

సన్నాహాలు చేస్తున్నాం



మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాలు చేపట్టేందుకు ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలో సన్నాహాలు చేస్తున్నాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే వెంటనే కొనుగోల్లు ప్రారంభిస్తాం.

– దివ్యభారతి, మార్క్‌ఫెడ్ డీఎం

ఓటరు బ్రహ్మాస్త్రం సీ–విజిల్

- ఎన్నికల సంఘం రూపొందించిన యాప్
- నిమిషాల్లో రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు
- అక్రమాల అడ్డుకట్టకు దోహదం

గొల్లపల్లి: ఎన్నికల్లో అవినీతికి చెక్‌పెట్టడానికి ఎన్నికల సంఘం ఓటర్లకు ఒక బ్రహ్మాస్త్రాన్ని సిద్ధం చేసింది. అదే సీ–విజిల్ యాప్. ఇది ఎన్నికల్లో జరిగే అక్రమాలను అడ్డుకట్ట వేసే బ్రహ్మాస్త్రంగా చెబుతున్నారు. అభ్యర్థులు డబ్బు, మద్యం, ఇతర వస్తువులను ఓటర్లకు ఎరగా చూపి అడ్డదారిలో గెలపొందేందుకు ప్రయత్నిస్తుంటారు. అలాంటి అవినీతి నాయకుల అంతు చూసేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుంది.

ఇలా పనిచేస్తుంది..

నాయకులు ఓటర్లకు డబ్బు, మద్యం లేదా ఇతర వస్తువుల రూపంలో ఇచ్చే క్రమంలో ఫొటోలు, వీడియోలు తీసి ఘటన స్థలం నుంచి సీ–విజిల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. వెంటనే ఆ దృశ్యాలు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌కి చేరుతాయి. వెంటనే అధికారులు అప్రమత్తమై అక్కడికి చేరుకుంటారు. ఆయా నాయకులపై చర్యలు తీసుకుంటారు. ఈ యాప్ ద్వారా అందే సమాచారం బలమైన సాక్ష్యంగా పనిచేస్తుంది. అవసరమైతే ఆయా అభ్యర్థుల సభ్యత్వాన్ని రద్దు చేసిన ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. ఫొటోలో లేదా వీడియోలు పంపిన వెంటనే ఫిర్యాదుదారుడు ఏ లొకేషన్ నెంచి వాటిని పంపారనేది అధికారులకు స్పష్టంగా తెలుస్తుంది. దీంతో వెంటనే చర్యలు తీసుకునేందుకు వీలుంటుంది. ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతారు.

పోలీస్ కంట్రోల్ రూంకు అనుసంధానం

ఈ సీ–విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులు, సమాచారం ఎన్నికల అధికారులతో పాటు నేరుగా పోలీస్ కంట్రోల్ రూమ్‌కు కూడా అందుతుంది. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, సర్వైలెన్స్ కమిటీలు, రిజర్వ్ టీమ్‌లు అప్రమత్తం అవుతాయి. వెంటనే లొకేషన్‌కు వెళ్లి బాధ్యులపై చర్యలు తీసుకుంటారు. అంతేకాదు అవినీతికి పాల్పడిన అభ్యర్థులపై ఏ విధమైన చర్యలు తీసుకున్నారనే సమాచారాన్ని సైతం ఫిర్యాదు చేసిన వారికి 100 నిమిషాల్లో యాప్ ద్వారా తెలియజేస్తారు.

నిజాయితీ పరులకు నేస్తం...

సభలు, సమావేశాల్లో ఎవరైన కోడ్ ఉల్లంఘించేలా ప్రసంగించినా.. ఏ అక్రమాలకు పాల్పడినా వెంటనే రికార్డు చేసి అన్యాయాన్ని అడ్డుకోవడానికి సీ–విజిల్ యాప్ ఎంతో ఉపయోగపడుతుంది. ఈ యాప్‌ను ఎన్నికల సంఘం 2018లోనే అందుబాటులోకి తెచ్చింది.

తప్పుడు సమాచారం స్వీకరించదు

ఈ సీ–విజిల్ యాప్‌ను తప్పుదోవ పట్టించే వీలు లేదు. ఈ యాప్‌ను ఘటన జరిగిన స్థలం నుంచే ఉపయోగించాలి. ఎవరోచోటుకు వెళ్లి తీసిన ఫొటోలు, తీసిన వీడియోలు అప్‌లోడ్ చేయడం సాధ్యంకాదు. అలాగే పాత ఫొటోలతో ఎదుటి వారిపై ఫిర్యాదు చేసినా తీసుకోదు.

తాగునీటికోసం మహిళల ఆందోళన



ఆందోళన చేస్తున్న మహిళలు

పెగడపల్లి:మండలంలోని అయితిపల్లి గ్రామానికి చెందిన 4, 5వార్డుల ప్రజలు తాగునీటి కోసం గ్రామ పంచాయతీ ఎదుట ఆదివారం ఆందోళన చేశారు. మిషన్ భగీరథ నీరు గ్రామంలోని ట్యాంక్‌కు.. అక్కడి నుంచి ఈ రెండు వార్డులకు సరఫరా చేసేవారు. అయితే 15 రోజులుగా నీటి సరఫరా కావడంలేదు. విషయాన్ని సంబంధిత అధికారులు, సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకుండాపోయింది. దీంతో ప్రజలు గ్రామ పంచాయతీ ఎదుట ఆందోళన చేశారు. ఎంపీవో మహేందర్ వారితో ఫోన్‌లో మాట్లాడి రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని చెప్పడంతో వారు వెనుదిరిగారు.

కొండగట్టులో మాజీ ఎంపీ పొన్నం పూజలు



పూజల్లో పాల్గొన్న మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్

కొండగట్టు(చొప్పదండి):కొండగట్టు అంజన్న స్వామి ఆలయంలో కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. తను హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి గెలుపొందాలని, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని ముడుపు కట్టినట్లు తెలిపారు. అర్చకులు ఆయనకు ఆశీర్వాదం అందించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే పోరాటం

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



జీవన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న కార్యకర్తలు

రాయికల్:గ్రామీణ ప్రజల సమస్యల పరిష్కారానికే తన పోరాటమని, ఎన్నికల్లో గెలిపిస్తే ప్రజల రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఆల్యనాయక్‌తండా, కైరిగూడెం, దావన్‌పెల్లి, ధర్మాజీపేట గ్రామాలకు చెందిన సుమారు 250 మంది తాట్లవాయిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ మేనిఫెస్టోనే సీఎం కేసీఆర్ కాపీ కొట్టారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకొస్తే మహాలక్ష్మీ, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, యువవికాసం చేయూత వంటి పథకాలు అమలు చేస్తామన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజరెడ్డి, భూపతిపూర్ మాజీ సర్పంచ్ శేఖర్‌రెడ్డి, నాయకులు సుధాకర్‌రెడ్డి, మంగీలాల్, సంతోష్, నరేష్, గంగారెడ్డి, మలయ్య, జితేందర్,యాదవ్, మండ రవి, గంగాధర్, తంగెల్ల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

జగిత్యాల రూరల్: పేదల సంక్షేమానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల రూరల్ మండలం పొలాసకు చెందిన మాజీ సర్పంచ్ శంకర్, మీర్జా అరీఫ్ బేగ్, కల్లెడ వంశీ కాంగ్రెస్‌లో చేరగా.. వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీని అధికారంలోకి వచ్చేందుకు కృషి చేయాలన్నారు. సర్పంచ్ గాజెంగి భారతి నందయ్య, నాయకులు పేర్కొన్నారు.

ఎన్నికల హామీలు విస్మరించిన బీఆర్‌ఎస్

- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



ప్రజలతో మాట్లాడుతున్న లక్ష్మన్‌కుమార్

పెగడపల్లి: ప్రజలకిచ్చిన హామీలను విస్మరించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, ధర్మపురి నియోజకవర్గ ఇన్‌చార్జీ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కోరారు. మండలంలోని దీకొండ, ల్యాగలమర్రి, ఎల్లాపూర్, కీచులాటపల్లి, రాజరాంపల్లి గ్రామాల్లో ఆదివారం గడపగడపకూ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ అమలు చేయనున్న ఆరు గ్యారంటీ పథకాలను వివరించారు. మంత్రి ఈశ్వర్ ధర్మపురి అభివృద్ధిపై ఎన్నడూ ఆలోచన చేయలేదన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులను అడ్డగోలుగా దోచుకుతిన్న రైస్‌మిల్లర్లపై మంత్రి ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకొస్తే రూ.500కే సిలిండర్, మహిళలకు ఉచిత బస్‌సౌకర్యం, రూ.4వేల ఆసరా పింఛన్, రైతుకు పెట్టుబడి సాయం రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు అందిస్తామన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాములుగౌడ్, నాయకులు శ్రీనివాస్, మల్లారెడ్డి, రాజేందర్‌రెడ్డి, శంకర్, సతీశ్‌రెడ్డి, భాస్కర్, రామగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ గారడీ పాలనకు చరమగీతం పాడాలి

- ఏఐసీసీ కార్యదర్శి క్రిస్టోఫర్ తిలక్



మాట్లాడుతున్న ఏఐసీసీ కార్యదర్శి తిలక్

కథలాపూర్(వేములవాడ): సీఎం కేసీఆర్ గారడీ పాలనకు చరమగీతం పాడాలని ఏఐసీసీ కార్యదర్శి క్రిస్టోఫర్ తిలక్ కోరారు. మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో వేములవాడ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆది శ్రీనివాస్‌తో కలిసి మాట్లాడారు. ఎన్నికల్లో 70 సీట్లు గెలుచుకుని కాంగ్రెస్ అధికారంలోకొస్తుందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అసమర్థతతో రాష్ట్రంలో నిరుద్యోగం పెరిగిపోయిందని మండిపడ్డారు. ఆచరణ సాధ్యంకాని హామీలు ఇవ్వడంలో సీఎం దిట్ట అని దుయ్యబట్టారు. పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను పక్కాగా అమలు చేస్తామన్నారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని కోరారు. నాయకులు కాయితి నాగరాజు, నరేశ్‌రెడ్డి, ఎండీ.అజీమ్, తొట్ల అంజయ్య, హరిప్రసాద్, లింగంగౌడ్, ఎగ్యారపు శ్రీహరి, గడ్డం స్వామిరెడ్డి, కారపు గంగాధర్, ధనుంజయ్‌రెడ్డి, ఎండీ.రేహన్, ముబీన్, పాల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం



స్వామివారిని దర్శించుకుంటున్న లక్ష్మణ్

బుగ్గారం(ధర్మపురి): ధర్మపురి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను అధిష్టానం ప్రకటించడంతో పార్టీ కార్యకర్తలు, నాయకుల సంబరాలు అంబరాన్నంటాయి. సాయంత్రం ధర్మపురి పట్టణంలోని ప్రధాన వీధుల్లో బాణాసంచా కాల్చుతూ సంబరాలు చేసుకున్నారు. మిఠాయిలు పంచిపెట్టారు. ఈసందర్భంగా లక్ష్మణ్‌కుమార్ ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. తన అభ్యర్థిత్వం ఖరారు చేసిన పార్టీలోని పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్‌కు రోజురోజుకు ఆదరణ పెరుగుతుందని ఈ సారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఎంసీసీ అధ్యక్షుడు సంగనభట్ల దినేష్, నాయకులు వేముల రాజేష్, సింహరాజు ప్రసాద్, రాందేని మొగిలి, అప్పం తిరుపతి, వొజ్జల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉదయం కాంగ్రెస్.. సాయంత్రం బీఆర్‌ఎస్..



సాయంత్రం బీఆర్‌ఎస్ నాయకులతో



ఉదయం కాంగ్రెస్ కండువాతో..

జగిత్యాలరూరల్:జగిత్యాలరూరల్ మండలం పొలాసకు చెందిన మాజీ సర్పంచ్ శంకర్ కొంతమంది అనుచరులతో ఆదివారం ఉదయం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. సాయంత్రం తిరిగి ఎంపీపీ పాలెపు రాజు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ కండువా కప్పుకున్నారు.

రూ.11 వేల మద్యం పట్టివేత

మెట్‌పల్లి: పట్టణంలోని అర్బన్ హౌజింగ్‌కాలనీలో బెల్టు దుకాణంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా అక్రమంగా నిల్వ ఉంచిన రూ.11వేల మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిర్వాహకుడు పంగ రాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

హైదరాబాద్‌లో జగిత్యాల యువకుడి ఆత్మహత్య



సాయిరాం (ఫైల్)

జగిత్యాల క్రైం: జిల్లాకేంద్రంలోని మహాలక్ష్మీనగర్‌కు చెందిన దొనకంటి సాయిరాం (30) హైదరాబాద్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. మల్యాల మండలం పోతారం గ్రామానికి చెందిన సాయిరాం జగిత్యాలలోని మహాలక్ష్మీనగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఉద్యోగరీత్యా హైదరాబాద్ వెళ్లాడు. హిమాయత్‌నగర్‌లోని వెలమ హాస్టల్‌లో శనివారం క్రిమిసంహారక మందు తాగాడు. స్థానికులు అతడిని గాంధీ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు.